హాస్టల్ సౌకర్యం లేక అవస్థలు

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ఆత్మకూరు మోడల్ స్కూల్ బీసీ, ఎస్టీ విద్యార్థులు
- అడ్మిషన్లు పెరిగినా వసతులు కల్పించడంలో అధికారులు విఫలం
- ఎస్సీ హాస్టల్‌ను జనరల్ చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్


ఆత్మకూరులోని మోడల్‌స్కూల్

ఆత్మకూర్(ఎస్) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలనే ప్రభుత్వ ఆశయం మంచిదే. కానీ, ఆ ఆశయానికి తగిన విధంగా వసతులను కల్పించడంలో మాత్రం ప్రభుత్వం విఫలమవుతోంది. ముఖ్యంగా మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు దీనికి నిదర్శనం. గత సంవత్సరం 331 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో, ఈ విద్యా సంవత్సరంలో బడిబాట వంటి కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు అదనంగా 104 మంది కొత్త విద్యార్థులను చేర్చుకున్నారు. దీంతో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 435కి చేరింది. ఇది ఒక శుభపరిణామమే అయినా, పెరిగిన విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

రవాణా కష్టాలు.. బీసీ, ఎస్టీ విద్యార్థులకు కరువైన హాస్టల్ వసతి

మోడల్ స్కూల్‌లో చేరిన విద్యార్థులు పలు గ్రామాలకు చెందినవారు. అయితే, మండల కేంద్రానికి సరైన బస్సు సౌకర్యం లేకపోవడం, ఇతర రవాణా సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉండటంతో విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో హాస్టల్ వసతి కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉంది. మండల కేంద్రంలో కేవలం ఎస్సీ హాస్టల్ మాత్రమే అందుబాటులో ఉండటంతో బీసీ, ఎస్టీ విద్యార్థులు అందులో చేరేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థులలో దాదాపు 13 మంది ఎస్సీలు, 25 మంది ఎస్టీలు, 44 మంది బీసీ విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది హాస్టల్ వసతి కోసమే ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎస్సీ విద్యార్థులకు స్థానికంగా హాస్టల్ వసతి ఉన్నప్పటికీ.. ఎస్టీ, బీసీ విద్యార్థులకు మాత్రం మండల కేంద్రంలో హాస్టల్ సౌకర్యం లేదు. ఎస్టీ విద్యార్థులకు నెమ్మికల్‌లో హాస్టల్ వసతి ఉండటంతో కొందరు విద్యార్థులు అక్కడికి వెళ్లి, ప్రతిరోజు ప్రతికూల వాతావరణ పరిస్థితులలోనూ నెమ్మికల్లు నుంచి ఆత్మకూరు మోడల్ స్కూల్‌కు వచ్చి తమ చదువును కొనసాగిస్తున్నారు.

ఎస్సీ హాస్టల్‌ను జనరల్ హాస్టల్‌గా మారిస్తే అందరికీ ప్రయోజనం..

మోడల్ స్కూల్‌లో నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్య లభిస్తుందనే ఆశతో మండలంతోపాటు సుదూర ప్రాంతాల నుంచి ఎంతో మంది బీసీ, ఎస్టీ విద్యార్థులు ఈ పాఠశాలలో చేరారు. అయితే వారికి ఎలాంటి హాస్టల్ వసతి లేకపోవడంతో చదువు కొనసాగించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎస్సీ హాస్టల్‌లో తమకు సీట్లు ఇవ్వాలని వేడుకుంటున్నారు. ఈ సమస్యపై జిల్లా అధికారులు స్పందించాలని, ఎస్సీ హాస్టల్‌ను జనరల్ హాస్టల్‌గా మార్చి అన్ని వర్గాల విద్యార్థులకూ వసతి కల్పించాలని పలువురు విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులందరికీ హాస్టల్ వసతి కల్పించాలి



మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను జనరల్ హాస్టల్‌గా మార్చి మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులందరికీ హాస్టల్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వం హాస్టల్ వసతి కల్పించకపోవడంతో బీసీ, ఎస్టీ విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఎస్టీ విద్యార్థులకు ఐదు కిలో మీటర్ల దూరంలోని నెమ్మికల్లులో హాస్టల్ వసతి ఉంది. అయితే సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో వారు కూడా ప్రతిరోజు పాఠశాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను జనరల్ హాస్టల్‌గా మార్చాలి.

– పోలెబోయిన కిరణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

విద్యాలయాల కేటాయింపు హర్షణీయం


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మంచాల రంగయ్య

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రానికి నవోదయ విద్యాలయం, కేంద్రీయ విద్యాలయం కేటాయించడం హర్షణీయమని బీజేపీ జిల్లా నాయకుడు మంచాల రంగయ్య తెలిపారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంచాల రంగయ్య మాట్లాడారు. మంత్రి కిషన్‌రెడ్డి కృషి ఫలితంగానే సూర్యాపేటకు నవోదయ, కేంద్రీయ పాఠశాలలను కేటాయించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ఐదో తరగతి, 6వ తరగతి వారికి తాత్కాలికంగా రెడ్డి హాస్టల్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు సన్నాహక సమావేశం

నూతనకల్ : మిర్యాల గ్రామంలోని శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయానికి చెందిన వ్యవసాయ భూములకు జూలై 4న నిర్వహించే బహిరంగ వేలానికి సంబంధించి సోమవారం గ్రామంలో రైతులతో నిర్వహించే సన్నాహక సమావేశానికి రైతులు, గ్రామస్తులు హాజరు కావాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వివిధ సర్వే నంబర్లలో భూముల విస్తీర్ణం విషయాలను తెలియజేయడం కోసం దేవాలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ దిర్శనపు కృష్ణమూర్తి కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం జూలై 3, 4, 5 తేదీలలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం అర్వపల్లిలో కరపత్రాలను ఆవిష్కరించారు. దీక్షలకు ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొణతం కరుణాకర్‌రెడ్డి, లింగంపల్లి రమణ, కుంభం మదన్‌మోహన్, ఖాజా, రాజు, యాదగిరి, అనిల్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలపై అవగాహన


వైద్యసేవలపై విద్యార్థులకు వివరిస్తున్న మండల వైద్యాధికారి స్రవంతి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి స్రవంతి మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను వివరించారు. గర్భిణులు, పిల్లలకు టీకాలు ఇవ్వడం, వ్యాధిగ్రస్తులకు ఔషధాలు ఇవ్వడం, శస్త్ర చికిత్సలు నిర్వహించడం తదితర అంశాల గురించి తెలియజేశారు. అలాగే వ్యాధులు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మామిడి వెంకటయ్య, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు సీనియర్ నాయకుడికి పరామర్శ

సూర్యాపేట అర్బన్ : పట్టణానికి చెందిన కమ్యూనిస్టు సీనియర్ కార్యకర్త మరిపెల్లి వెంకన్న అనారోగ్యంతో మంచానికే పరిమితం అటయ్యారు. 48వ వార్డు వాణిజ్య భవన్ శాఖ కార్యదర్శి బొమ్మిడి లక్ష్మీనారాయణ ఆదివారం వెంకన్న నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య సమాచారం తెలుసుకొని ఆర్థికసాయం అందజేశారు. ఆయనతో పాటు సీపీఎం మహిళా నాయకురాలు చిత్రం భద్రమ్మ, నాయకులు సురేష్, కిషన్, నరసింహారెడ్డి ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు

అర్వపల్లి : బొల్లంపల్లిలో ఆదివారం నాగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా మురుగు కాల్వలు, నీటి గుంతలలో దోమల నిర్మూలనకు ఢీమోపాస్ మందును పిచికారీ చేశారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగరాజు, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ రామచంద్ర, యాదగిరి, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్‌తోపాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత


మొక్కలు నాటుతున్న గ్రీన్ క్లబ్ సభ్యులు, కాలనీవాసులు

సూర్యాపేట : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రీన్ క్లబ్ ట్రస్ట్ చైర్మన్ ముప్పారపు నరేందర్, బీజేపీ నాయకులు సలిగంటి వీరేంద్ర అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్, దశరథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం ఇంటింటికీ తిరిగి గుడ్డ సంచులు పంపిణీ చేశారు. దశరథ మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్‌వీవీ ప్రసాద్ సహకారంతో ప్రధాన కార్యదర్శి కొరిపల్లి సురేష్ కుమార్ ఉషారాణి దంపతులు గుడ్డ సంచులు పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో రామచందర్ రావు, తిరుమలనగర్ అధ్యక్షుడు బండి పాపిరెడ్డి, రాము యాదవ్, జలేందర్, మల్లయ్య, యాదయ్య, వెంకటరెడ్డి, గోపిరెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, భిక్షం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్, రాజశేఖర్, గ్రీన్ క్లబ్ ఉపాధ్యక్షుడు బొలిశెట్టి మధు, కోశాధికారి ఉప్పల శ్రవణ్, మిర్యాల వెంకటేశ్వర్లు, తల్లాడ రామచంద్రయ్య, సోమా సురేష్ పాల్గొన్నారు.

మహాజన మార్గదర్శి మంద కృష్ణమాదిగ


నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న యాతాకుల రాజన్న మాదిగ

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సామాజిక ఉద్యమాల పితామహుడు, మహాజన మార్గదర్శి మంద కృష్ణ మాదిగ అని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ అన్నారు. ఆదివారం యర్కారం గ్రామంలో మిద్దె శ్రావణ్ కుమార్ మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మిద్దె సైదులు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా చింతలపాటి సదర్శన్ మాదిగ, ఉపాధ్యక్షులుగా బుర్ర అనీల్ మాదిగ, మిద్దె ప్రవీణ్ మాదిగ, కార్యదర్శిగా బొర్ర శ్రీరాములు మాదిగ, సహాయ కార్యదర్శిగా పడిదల రమేష్ మాదిగ, ప్రచార కార్యదర్శి పాల్వాయి నాగయ్య మాదిగ, సహాయ కార్యదర్శిగా బొర్రా నగేష్ మాదిగ , సాంస్కృతిక కార్యదర్శిగా మిద్దె కృష్ణ మాదిగ, సహాయ కార్యదర్శిగా నర్రా అమరేందర్ మాదిగలను నియమించారు. అనంతరం రాజన్న మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, కళానేత గంట భిక్షపతి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

ధూమ్ర వారాహిని పూజిస్తే శత్రు బాధలు ఉండవు


సూర్యాపేటలోని సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు


తాళ్లగడ్డ (సూర్యాపేట) : పిల్లలమర్రిలోని ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

సూర్యాపేట : ధూమ్ర వారాహి దేవిని పూజించడం వల్ల శత్రు బాధలు తొలిగిపోతాయని శ్రీసంతోషి మాత దేవాలయం అర్చకుడు బట్టారం వంశీకృష్ణ శర్మ తెలిపారు. శ్రీవారాహి మాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో అమ్మవారిని 4వ రోజు ధుమ్రా వారాహి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మాట్లాడుతూ ధూమ్ర వారాహిని సాధారణంగా శత్రువులను, కష్టాలను తొలగించడానికి పూజిస్తారని తెలిపారు. ఉత్సవాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు నూక వెంకటేశ్వర్లు గుప్తా, ప్రధాన కార్యదర్శి బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం, దేవాలయ క్లర్క్ దులుసోజు జలేందర్, భక్తులు గజ్జి నవీన్, శివపార్వతి, చిట్టిమల్లి సంతోషి భవాని, సారగుండ్ల సరిత, మనసాని అరుణ, పోలా విజేత, తెడ్ల ఉమామహేశ్వరి, నంద్యాల స్వాతి, పందిరి వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు సంతోషిమాత ఆలయంలో అక్షరాభ్యాసం..

శ్రీవారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆషాఢ మాసం శుద్ధ పంచమిని పురస్కరించుకొని సోమవారం అమ్మవారి సన్నిధిలో ఉదయం 9 గంటలకు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు దేవాలయ ప్రధాన కార్యదర్శి బ్రహ్మాండ్లపల్లి మురళీధర్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

శ్రీవారాహి మాత నవరాత్రి ఉత్సవాలు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట మండల పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలోని శ్రీ నామేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మ సమేత శ్రీ సరస్వతి దేవి ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆదివారం నాలుగవ రోజు ఆలయ ప్రధాన అర్చకుడు మునగలేటి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడిగా ఉప్పల నాగమల్లు


నాగమల్లు

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన ఉప్పుల నాగమల్లు తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం తుంగతుర్తి మండల అధ్యక్షుడిగా నియమితులైనట్లు ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సామ అంజిరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా నాగమల్లు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సామ అంజిరెడ్డి, ఉద్యమకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న హెచ్‌ఎం రాములు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పిల్లలమర్రి ఎంపీపీఎస్ హెచ్‌ఎం రాములు అన్నారు. సూర్యాపేట మండలం పిల్లలమర్రిలో ఆదివారం బడిబాట స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కావలసిన అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజనం, ఉదయం పాఠశాలకు రాగానే రాగిజావ వంటి సదుపాయాలు కల్పించబడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులు, డ్రైవర్ల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి

- ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి


నాగారంలో బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

నాగారం : అసంఘటిత కార్మికులు, డ్రైవర్ల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి చేస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. నాగారం గ్రామానికి చెందిన శీలం శ్రీను అనే డ్రైవర్ కొన్ని నెలల క్రితం ప్రమాదవశాత్తు ఇల్లు గోడ మీద కూలి మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబానికి మాజీ సీఎం కేసీఆర్ 2015లో ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పథకం నుంచి రూ.500,000 చెక్కు మంజూరైంది. ఆ చెక్కును ఆదివారం మండల కేంద్రంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌తో కలిసి మృతుడి భార్య శీలం పద్మకు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల, డ్రైవర్ల సంక్షేమం కోసం మాజీ సీఎం ప్రమాద బీమా ఏర్పాటు చేశారని తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన బీమా కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, హుజూర్‌నగర్ ఇన్‌చార్జ్ ఒంటెద్దు నర్సింహారెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ క్యామ మల్లేష్, నాయకులు గుజ్జ యుగేందర్‌రావు, నేవూరి ధర్మేందర్‌రెడ్డి, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఏ రజాక్, గౌడిచర్ల సత్యనారాయణ, నాగారం మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, గుండగాని సోమేష్, తాటికొండ సీతయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్ బండ్‌పై మార్నింగ్ వాక్

సూర్యాపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్‌పై ఆదివారం ఉదయం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా మినీ ట్యాంక్ బండ్‌పై వాకర్స్‌తో ముచ్చటించారు. వాకింగ్‌కు వచ్చిన చిన్నారులను, పట్టణవాసులను పలకరిస్తూ.. ట్యాంక్ బండ్‌పై గంటకు పైగా సందడి చేశారు. వాకింగ్ సమయంలో పలువురు పట్టణవాసులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

నరేందర్‌ను పరామర్శించిన జగదీష్ రెడ్డి

సూర్యాపేట : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్నేహనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కుక్కడపు నరేందర్‌ను ఆదివారం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

రంగమ్మ కుటుంబానికి పరామర్శ

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట మండల పరిధిలోని రామారం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు ఉప్పు రంగమ్మ ఇటీవల మృతి చెందింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదివారం రంగమ్మ ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.


మినీ ట్యాంక్ బండ్‌పై వాకింగ్ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి


సూర్యాపేట : నరేందర్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


తాళ్లగడ్డ (సూర్యాపేట) : మృతురాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగదీష్ రెడ్డి, తదితరులు

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెట్టాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న గోపయ్య

ఆత్మకూర్(ఎస్) : ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచి ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని వ్యవసాయ సామాజిక కార్యకర్త డాక్టర్ మొలుగూరి గోపయ్య (గోపి) కోరారు. ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంతోపాటు దాచారం, తుమ్మలపెన్‌పహాడ్, కోటపహాడ్ గ్రామాలలో రైతు చైతన్య యాత్ర నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాగులో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. గత 60 ఏళ్లుగా చేస్తున్న రసాయన వ్యవసాయంతో నేల పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యం కాబట్టి నేల ఆరోగ్యంగా ఉండేందుకు జీవామృతం వాడాలన్నారు. ప్రస్తుతం వేప గింజలను సేకరించుకోవాలని, పంట దశలో పురుగుల నివారణకు వేప గింజల కషాయం పిచికారీ చేయవచ్చని సూచించారు. దీంతో రైతులకు పురుగు మందుల ఖర్చులు తగ్గుతాయన్నారు. ప్రతి రైతు తమ కుటుంబ ఆరోగ్య అవసరాలకు ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రూ.2.50లక్షల ఎల్‌ఓసీ అందజేత


బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ కాపీని అందజేస్తున్న నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన నర్సింగ లింగయ్య కుమార్తె నర్సింగ పూజ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమారెడ్డి చొరవ, డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి సహకారంతో ఈ నిధులు మంజూరయ్యాయి. ఆదివారం ఎల్‌ఓసీ కాపీని స్థానిక నాయకులు పూజ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు నర్సింగ కృష్ణమూర్తితో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంత జీవితం

అర్వపల్లి : ధ్యానంతో ప్రశాంత జీవనం సాగించవచ్చని సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటరంగారావు అన్నారు. ఆదివారం అర్వపల్లిలోని ధ్యాన శిక్షణ కేంద్రంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీ రామచంద్ర మిషన్‌ల ఆధ్వర్యంలో ఉచిత యోగా ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా, ధ్యానంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అభ్యాసకులతో ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో అభ్యాసకులు వనం రమేష్, మేకల సత్యనారాయణ, మనుబోతుల వీరయ్య, సతీష్, ఉమారాణి, డాక్టర్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లును ఆమోదించాలి

నూతనకల్: బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే బీసీ బిల్లును ఆమోదించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మూరగుండ్ల లక్ష్మయ్య, గీత పనివారల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురంలోని పీఏసీఎస్‌లో వివిధ రకాల వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయని సీఈఓ ఊర సత్యనారాయణ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దొడ్డు రకాల విత్తనాలు ఎంటీయూ 1010, కేఎన్‌ఎం 118, ఎంటీయూ 1290, జేజీఎల్ 24423 అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే ధాన్యానికి బోనస్ వచ్చే సన్నరకాల వరి విత్తనాలు బీపీటీ 5204, ఎంటీయూ 1224, కేఎన్‌ఎం 1638 అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఎరువులు డీఏపీ, 20–20–0–13, 28–28–0 రకాలు ఉన్నాయని తెలిపారు. కావాల్సిన రైతులు తీసుకెళ్లాలని కోరారు.

చివ్వెంలలో ఉచిత మెగా వైద్యశిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చివ్వెంల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన టీం విమలాకర్ ఆధ్వర్యంలో కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రులు సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఈ శిబిరంలో ఆయా ఆసుపత్రుల వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా అల్ట్రా సౌండ్ అబ్డామిన్, యూజీఐ ఎండోస్కోపీ, ప్రాక్టోస్కోపీ, ఈసీజీ, 2డీ–ఎకో, సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్), లివర్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్, బీపీ, షుగర్ వంటి 14 రకాల స్క్రీనింగ్ టెస్టులు చేశారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్యాస్ట్రాలజీ డాక్టర్ విమలాకర్ రెడ్డి, లంబాడీ విద్యార్థి సేనా రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ బాలు నాయక్, ఏబీఎస్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ నాయక్, శ్రీనివాస్ నాయక్, మాదారపు అనిల్, మంగ్తా నాయక్, భానోత్ లింగానాయక్, రేణుక లాకునాయక్, సాగర్ నాయక్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి పరామర్శ

సూర్యాపేట అర్బన్ : తాటి చెట్టు పైనుంచి పడి గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సూర్యాపేట పట్టణానికి చెందిన కల్లుగీత కార్మికుడు చిత్తలూరి సైదులును ఆదివారం గీత కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎలుగూరి గోవిందు, మడ్డి అంజిబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న బాధితుడికి తక్షణమే ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ బొమ్మగాని మారయ్య, సంఘం నాయకులు గునగంటి సైదులు, చిత్తలూరి సైదమ్మ, గీతకార్మిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.